క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



డోర్నకల్ : మండలంలోని ముల్కలపల్లిలో గురువారం 26 మందికి రూ.7,46,500 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాసం శేఖర్, ధరంసోత్ జగదీష్‌నాయక్, వరదారెడ్డి, ఆంగోత్ వెంకన్న ఉపేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

డోర్నకల్ : నాయీబ్రాహ్మణుల కమిటీ హాల్ నిర్మాణానికి మున్సిపాలిటీ పరిధిలో 500 గజాల స్థలం కేటాయించాలని డోర్నకల్ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ గురువారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్నకు వినతిపత్రం అందించారు. వార్డు కౌన్సిలర్ బోరగళ్ల శరత్, నాయకులు ఆవుదుర్తి మల్లికార్జున్, మార్కారపు రాము, రవి, బిందు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడుదాం



బయ్యారం : సమాజంలో స్త్రీ, పురుష సమాన హక్కుల కోసం పోరాడుదామని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ అన్నారు. బయ్యారంలో గురువారం నిర్వహించిన పీఓడబ్ల్యూ జిల్లా మహాసభను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడుల నివారణతో పాటు హక్కుల సాధనకు ఐక్యం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు ఎండీ.కవిత, ఎస్.కవిత, సోమక్క, దర్గక్క, రజిత, కనకమ్మ, ఉపేంద్ర, లక్ష్మి, సుజాత, నీరజ, సుగుణ పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలి



నెహ్రూసెంటర్ : బీఆర్‌ఎస్ హయాంలో ఉద్యమకారులు, వామపక్ష నేతలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అన్నారు. సాలార్‌తండా రైతు పోరాట కేసులో భాగంగా కోర్టుకు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గిరిజనుల భూముల రక్షణకై పోరాడితే కేసులు బనాయించారని అన్నారు. ఉద్యమకారులు, వామపక్ష నేతలపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవీన్, శివాజీ, సురేందర్, వెంకన్న, బాలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి



గార్ల : ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ గురువారం ముదిరాజ్‌లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎం.రాంభద్రం, కొత్తూరు రమేష్, పందుల నారాయణ, ఎద్దు లక్ష్మణ్, సీహెచ్ ఆంజనేయులు, రాములు, రాకేష్, సతీష్, ఉపేందర్, భిక్షమయ్య, చంద్రశేఖర్, రాము, సంపత్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీపీఎం పోరాటం



నెహ్రూసెంటర్ : పేదలకు అండగా సీపీఎం పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ గుండ్లకుంట కాలనీతో పాటు ఇతర కాలనీ శాఖల సమావేశాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం నాయకులు పేదలకు అండగా ఉండాలని, సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని సూచించారు.ఈ నెల 29వ తేదీన బయ్యారంలో జరిగే సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో చీపిరి యాకయ్య, గాడిపెల్లి శ్యామ్, సురేష్, వెంకన్న, శ్రీనివాస్, బిక్షపతి, ఉపేందర్, వీరభద్రం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారీ మానుకోవాలి

- డీఎస్పీ తిరుపతిరావు
- గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి



కురవి: తండావాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ తిరుపతిరావు, పోలీసులు



మరిపెడ రూరల్: చింతలగడ్డతండాలో అవగాహన కల్పిస్తున్న సీఐ

కురవి : తండాల్లో గుడుంబా తయారీని పూర్తిగా మానుకోవాలని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. గురువారం కురవి పోలీసుల ఆధ్వర్యంలో రాజోలు శివారు బంధంకొమ్ము తండా, హర్య తండా, హరిదాసు తండా, బాలు తండాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. బెల్లం పానకాన్ని పారబోశారు. ఎస్సై బైరు గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ టౌన్ పోలీసులు పట్టణ పరిధిలోని పలుతండాల్లో, రూరల్ పోలీసులు మండలంలోని పలు గ్రామాల పరిధిలో గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. డీఎస్పీ తిరుపతిరావు, టౌన్, రూరల్ సీఐలు పెండ్యాల దేవేందర్, పి.సర్వయ్య, ఎస్సైలు బి.విజయ్ కుమార్, వి.దీపికరెడ్డి, సిబ్బంది గుడుంబా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో క్వింటా నల్లబెల్లం, 40 లీటర్ల గుడుంబా, 10 కిలోల పటిక స్వాధీనం చేసుకుని, 350 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

గార్ల : మండలంలోని కోట్యానాయక్ తండాకు చెందిన గుగులోత్ కిషన్, ధరావత్ శంకర్ ఇంట్లో గుడుంబా తయారు చేసి విక్రయిస్తుండగా పక్కా సమాచారం మేరకు గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 17 లీటర్ల గుడుంబా, 400 లీటర్ల బెల్లం పానకంను స్వాధీనం చేసుకొని పై ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ జీనత్‌కుమార్ తెలిపారు.

నెల్లికుదురు : మండలంలోని బంజర పరిధిలోని పలు తండాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు చేసి బానోత్ సైదులు ఇంట్లో 10 లీటర్ల గుడుంబాను, 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

గుడుంబా తయారు చేస్తే పథకాలు కట్

గూడూరు : గుడుంబా తయారు చేసిన.. విక్రయించినా వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కట్ చేయిస్తామని ఎస్సై సీహెచ్. నగేష్ హెచ్చరించారు. మండల వ్యాప్తంగా దాడులు చేసి 250 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.

డోర్నకల్ : మండలంలోని గుర్రాలకుంట తండా, తెల్లబండ తండా గ్రామాల్లో గురువారం డోర్నకల్ పోలీసులు గుడంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 1000 లీటర్లకు పైగా గుడుంబా పానకాన్ని ధ్వంసం చేసి 20 లీటర్ల గుడంబాను స్వాధీనపర్చుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్‌రావు తెలిపారు.

బయ్యారం : మండలంలోని ఉప్పలపాడు, నర్సా తండా, జగ్గా తండా గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై గురువారం ఎస్సై తిరుపతితో పాటు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబా, 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా రహిత సమాజం కోసం పాటు పడాలి

మరిపెడ రూరల్ : గుడుంబా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని మరిపెడ సీఐ హతీరాం నాయక్ అన్నారు. మరిపెడ మండలంలోని చింతలగడ్డతండా గ్రామ పరిధిలోని రేఖ్యతండా, మరిపెడ మున్సిపల్ పరిధిలోని దేశ్యతండాల్లో సీఐ ఆధ్వర్యంలో గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

8 లీటర్లు స్వాధీనం.. ఒకరిపై కేసు

దంతాలపల్లి : మండలంలోని గోప్యాతండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 8 లీటర్ల గుడుంబాతో పాటు 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. అలాగే గుగులోత్ సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

70 లీటర్ల పట్టివేత.. ముగ్గురిపై కేసు నమోదు

కేసముద్రం : అక్రమంగా తరలిస్తున్న 50 లీటర్ల గుడుంబాను పోలీసులు పట్టుకున్న సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన ప్రకారం..నెక్కొండ మండలం పెద్దకొర్పోలు గ్రామ శివారు రేకులతండాకు చెందిన బాదావత్ బాబు 50 లీటర్ల సారాను, కేసముద్రం రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా గాంధీపురం జీపీ శివారు తండా, వెంకట్రాంతండాలో గుడుంబా స్థావరాలపై దాడులు చేసి, 200 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీతోడుగా.. నేను

- అనారోగ్యంతో భర్త..
  గుండెపోటుతో భార్య మృతి



ముత్తయ్య, యశోదమ్మ(ఫైల్)

డోర్నకల్ : పతితో ఏడడుగులు నడిచిన సతి.. నిను విడిచి నేనుండా లేనంటూ భర్త మృతిని తట్టుకోలేక భార్య గుండెపోటుతో తుదిశ్వాస విడిచింది. అనారోగ్యంతో భర్త మృతి చెందగా, భర్త మృతిని తట్టుకోలేక భార్య గుండెపోటుతో మృతి చెందిన విషాద సంఘటన మండలంలోని ముల్కలపల్లి జరిగింది. గ్రామానికి చెందిన సత్తి ముత్తయ్య(85) కొంత కాలంగా అనారోగ్యంతో ఖమ్మంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. అయితే ముత్తయ్య మృతదేహాన్ని ముల్కలపల్లికి తీసుకురాగా భర్త మృతదేహం వద్ద విలపిస్తూ యశోదమ్మ (75) గురువారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు యశోదమ్మను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. యశోదమ్మ బుధవారం వృద్ధాప్య పింఛన్ తీసుకుని అందరితో చనువుగా ఉండగా భర్త మృతితో తీవ్ర మనస్తాపానికి గురై గుండెపోటుతో మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతి చెందిన దంపతులకు ఏకకాలంలో నిర్వహించిన అంత్యక్రియలకు గ్రామస్తులతో పాటు బంధువులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బురదరోడ్డుపై నాట్లు వేసి నిరసన



నాట్లు వేసి నిరసన తెలుపుతున్న తండావాసులు

కేసముద్రం : ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి శివారు కోక్యా తండాకు చెందిన స్థానికులు గురువారం బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. తండా మీదుగా గ్రానైట్ లారీలు వెళ్తుండటంతో రోడ్డుపై గుంతలు పడి, బురదమయంగా మారిందని తండావాసులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న షీ టీం ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్ : సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫాణిని హైస్కూల్‌లో గురువారం షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న క్రమంలో విద్యార్థినులు వెంటనే డయల్–100కు ఫోన్ చేయాలన్నారు. ఈవిటీజింగ్, గుడ్ బ్యాడ్ టచ్‌లపై అవగహన తెలుసుకోవాలని, సోషల్‌మీడియలో వ్యక్తిగత ఫొటోలు షేర్ చేయవద్దని, సైబర్ నేరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ఐజేయూ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గూడూరు : వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే టీయుడబ్ల్యూజే (ఐజేయూ) ధ్యేయమని జిల్లా అధ్యక్షుడు చింతనూరి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం స్థానిక విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రపు యాకాంబ్రం, ఉపాధ్యక్షులుగా కన్న వెంకటేశ్వర్లు, బీరవెల్లి శ్రీధర్, బోడ రాజు, ప్రధాన కార్యదర్శిగా భూక్య మంగీలాల్, సహాయ కార్యదర్శులుగా ఈసం సురేష్, దేషు నరేష్, ఎస్‌కే యాకూబ్ అలి, కోశాధికారిగా కుందూరు కర్ణాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

క్రైం కార్నర్

విద్యార్థి అదృశ్యం



బానోత్ తనీష్

గార్ల : మండలంలోని చిన్నబంజరకు చెందిన విద్యార్థి బానోత్ తనీష్ ఇల్లందులోని బీసీ వసతిగృహంలో ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కాగా రెండ్రోజుల నుంచి విద్యార్థి కనిపించక పోవడంతో తల్లిదండ్రులు తారాచంద్, పద్మ ఆందోళన చెందుతున్నారు. బంధువుల ఇళ్లలో వెతికినా విద్యార్థి ఆచూకి లేకపోవడంతో బీసీ వసతిగృహం వార్డెన్ రవి ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆచూకి తెలిస్తే వెంటనే 99081 35160, 95500 51848 నంబర్లకు సమాచారం ఇవ్వాలని విద్యార్థి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

టాటాఏస్ వాహనం బోల్తా..

కేసముద్రం : టాటా ఏస్ వాహనం అదుపుతప్పి బోల్తా పడగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ముగ్గురు కూలీలకు గాయాలయ్యాయి. ఎస్సై మురళీధర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే కాంట్రాక్ట్ వద్ద పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పలువురు గురువారం నెక్కొండ నుంచి మానుకోటకు టాటా ఏస్ వాహనంలో రైల్వే ఎలక్ట్రికల్ వస్తువులను తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో కేసముద్రం మండలం కల్వాల దాటాక మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో వాహనంలో ఉన్న కిరణ్‌భగల్, బిట్టులాల్‌మాజీతోపాటు మరొకరికి గాయాలయ్యాయి. దీంతో 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మహిళకు పాము కాటు

గంగారం : మండలంలోని కాటినాగారం గ్రామానికి చెందిన ఈసం సుశీలకు గురువారం విషపాము కాటు వేసింది. దీంతో బంధువులు వెంటనే అంబులెన్స్‌లో నర్సంపేట ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



యాదమ్మ(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కంచర్ల యాదమ్మ (102) మృతిచెందింది. యాదమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని బుధవారం అర్ధరాత్రి మృతిచెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్రం



బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపిందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలుగు శ్రావణ్, మాగం లోకేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు గురువారం కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. డిజిటల్ గ్రంథాలయం నిధుల, జాతీయ విద్యామిషన్ నిధులు, ఏకలవ్య పాఠశాలలో టీచర్ పోస్టులు భర్తీ, 157 నర్సింగ్ కళాశాలల, ఐటీఐలకు బడ్జెట్‌వంటి అంశాలను ప్రస్తావలేదన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు లేవన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి మెక వెంకటేష్ ,పట్టణ కార్యదర్శి చెలుపూరి వికాస్, నాయకులు శ్రావణ్, వేణు, తరుణ్, రంజిత్, క్రాంతి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు మాదారపు నాగరాజు, జిల్లా సహాయకార్యదర్శి రఫీ, నాయకులు విజయ్, కెవిన్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సౌకర్యాల కల్పనకు కృషి

డోర్నకల్ : స్థానిక మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. పాఠశాల నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డును పరిశీలించి చైర్మన్ బాలికలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిజ్వానా, కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం : ఖమ్మంలో ఈనెల 28న జరగనున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ సంతాప సభ వాల్ పోస్టర్లను గురువారం ఆపార్టీ నాయకులు మండల కేంద్రంలో ఆవిష్కరించారు. చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కందాల రంగయ్య, భిక్షం, సుధాకర్, లక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : భవన నిర్మాణరంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నేడు (శుక్రవారం) నిర్వహించే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అజయ్‌సారధిరెడ్డి, రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం మంద శంకర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే భారీ బహిరంగసభకు కార్మికులు వేలాదిగా తరలిరావాలని కోరారు. జానీ, పాల్, పాష, రవి, రాములు, మధు, కనకరాజు, శ్రావణ్, వీరన్న, అశోక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

9న చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్ : ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 9వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్లో చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు.

ప్రత్యేక పూజలు

మహబూబాబాద్ రూరల్ : సంకటహర చతుర్థి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎం వీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో లక్ష్మిగణపతి స్వామివారికి విశేష అభిషేకాలు జరిపి అలంకరణ, అర్చన పూజలు నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ

గార్ల : ఎంపీఓగా జి.విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీఓగా పనిచేసిన రజిని చిన్న గూడూరు మండలం ఎంపీఓగా బదిలీ అయ్యారు.

అవకాశం కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్ : లెఫ్ట్ ఓవర్‌లో మిగిలిపోయిన పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రోస్టర్ పాటించి ని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ కోరారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో గురువారం ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు నిరసన చేశారు.

ఉన్నత విద్యలో రాణించాలి

మహబూబాబాద్ అర్బన్ : కార్మికుల పిల్లలు ఉన్నత విద్యావంతులు కావాలని కేజీబీవీ జిల్లా జీసీడీఓ అధికారి విజయ కుమారి సూచించారు. కేజీబీవీలో ఇంటర్ విద్యార్థి ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి కేయూలో ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత సీటు లభించగా ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి

నెహ్రూసెంటర్ : మానవాళి మనుగడకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ప్రజాహృదయం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దైద వెంకన్న కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధిరెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మొక్కలు నాటారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

మరిపెడ : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం మొండి చేయి చూపిందని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు. మరిపెడలో ఆయన మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వ కక్షపూరితంగా వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. అబ్దుల్ రషీద్, యాకన్న, అంజి. నారాయణ, లింగన్న పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్ : జిల్లాలోని ఏకలవ్య పాఠశాల అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ కోరారు. ఈ మేరకు గురువారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతుల భూములను తీసుకోవద్దు

మహబూబాబాద్ అర్బన్ : ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అభివృద్ధికి గిరిజన రైతుల భూములను తీసుకోవడం మానుకోవాలని బాబునాయక్ తండా రైతులు అంగోత్ హనుమ, బానోత్ బద్య, హర్యా, నర్సింగ్, లక్ష్మి కోరారు. హైదరాబాద్‌లో జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజేష్, శ్రీను, రవి, రమేష్, శ్రీను, కిరణ్, కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైకార్ చైర్మన్‌కు అభినందనలు

బయ్యారం : ట్రైకార్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ తేజావత్ బెల్లయ్యానాయక్‌ను గురువారం ఎల్‌హెచ్‌పీఎస్ ఏక్ మత్రో రాష్ట్ర అధ్యక్షుడు వాంకుడోత్ మంగీలాల్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

బియ్యం అందజేత

కేసముద్రం: మండలంలోని కల్వాలకు చెందిన పుల్లమ్మ, సోమయ్యచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించి, ఇరు కుటుంబాలకు 50 కేజీల బియ్యం చొప్పున అందజేశారు.

ఆర్థికసాయం

కురవి : హర్యతండాకు చెందిన ఆంగోత్ బుజ్జి అనారోగ్యంతో మృతి చెందింది. కాగా డోర్నకల్ విజయ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు గురువారం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

లాభసాటి పంటలపై దృష్టి సారించాలి

గార్ల : రైతులు లాభసాటి పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. గురువారం మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన భావ్‌సింగ్ సాగుచేసిన ఆయిల్‌పామ్ పంటను ఆయన క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం పంటల సాగుకు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు.

రామచంద్రయ్య ఆశయసాధనకు ఉద్యమిద్దాం

నెహ్రూసెంటర్ : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత దేశెట్టి రామచంద్రయ్య ఆశయ సాధనకు ఉద్యమించాలని పార్టీ జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్, భట్టు చైతన్య, హరీష్ అన్నారు. రామచంద్రయ్య వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల అభివృద్ధి కోసం చివరిశ్వాస వరకు పోరాటాలు కొనసాగించారని, ప్రజా ఉద్యమాలకు ఆయన లేని లోటు తీరనిదన్నారు. కార్యక్రమంలో మాదారపు నాగరాజు, మామిడాల వెంకన్న, జినుక బాబు, మహేష్, విజయ్, రాజు, రవి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

మరిపెడ రూరల్ : సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులు సంఘటితంగా పోరాడాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కీసర రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండెపుడి, తానంచర్ల ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి పీఆర్టీయూ సభ్యత్వ నమోదును గురువారం రమేష్‌రెడ్డి ప్రారంభించారు.

జీఓలను సవరించాలి



తొర్రూరు రూరల్ : ఉద్యోగుల పదోన్నతి సర్వీస్ నిబంధనల జీఓలను సవరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నాగమల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని నాంచారీమడూరు, వెలికట్ట, హరిపిరాల, మాటేడు ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించి యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, యాకూబ్, రంజిత్, కుమార్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ కమిటీ ఎన్నిక

దంతాలపల్లి : పీడీఎస్‌యూ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బాదవత్ నరేష్, కార్యదర్శిగా కేలోత్ ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా సురేషతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

గ్రామీణ ఆదర్శ వైద్యుల సంఘం..

నెల్లికుదురు : రాష్ట్ర ఆదర్శ వైద్యుల సంఘం మండల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రచారి తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఎస్‌కే జహూర్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొల్లు మురళి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా హుస్సేన్ నాయక్, కోశాధికారిగా నగేష్‌తో పాటు కమిటీ సభ్యులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

సేవలు మరువలేనివి

చిన్నగూడూరు : ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని హెచ్ఎం రవికుమార్ కొనియాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం పాటు విధులను నిర్వర్తించిన ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం బదిలీ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాలకు రూ.15 వేలు విలువైన కుర్చీలను, వివిధ సైంటిస్టులకు సంబంధించిన ఫొటో ఆల్బమ్‌ను బహూకరించారు.

నియామకం



జి.కల్యాణ్

మహబూబాబాద్ రూరల్ : లంబాడీల ఐక్యవేదిక (లైవ్) అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కార్యదర్శిగా మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడెంతండాకు చెందిన గుగులోత్ కల్యాణ్‌ను నియమించినట్లు లైవ్ రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త గుగులోత్ రమేష్ గురువారం తెలిపారు.

'విద్యార్థులు పోరాటాల్లో ముందుండాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

కురవి : విద్యార్థులు పోరాటాల్లో ముందుండాలని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు జిల్లా సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. మొదటి రోజు శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నది ఎస్‌ఎఫ్ఐ ఒక్కటేనన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు ఎక్కువగా కేటాయించాలన్నారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దామర కిరణ్, జిల్లా కన్వీనర్ పట్ల మధు, కమిటీ సభ్యులు సూర్య, జ్యోతిబసు, రాజేశ్, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మహబూబాబాద్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి బి.రామకృష్ణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం సీజనల్ వ్యాధులపై మెప్మా ఆర్పీలకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మానుకోట మున్సిపాలిటీలో మూడు డెంగీ, ఒక మలేరియా కేసు నమోదు అయిందన్నారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ విజయ, అధికారులు పాల్గొన్నారు.

తొర్రూరు : పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి మీరాజ్ అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి తగు వైద్యసాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ శైలజ, వైద్యులు ప్రియాంక, నందన, మానస, సిబ్బంది వెన్నెల, సుజాతలు పాల్గొన్నారు.